క్లుప్తంగా

టాటా ఏస్‌ను ఢీకొన్న బస్సు



రోడ్డు పక్కన పడిపోయిన టాటా ఏస్ వాహనం

గాండ్లపెంట: మండల కేంద్రానికి సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కదిరి–రాయచోటి ప్రధాన రహదారిపై శనివారం టాటా ఏస్ వాహనాన్ని రాయచోటి డిపో ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొట్టింది. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన బాషా టాటా ఏస్ వాహనంలో వేరుశనగ కాయల లోడుతో గాండ్లపెంటకు వెళ్తున్నాడు. వెనుక వైపు వస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు.. ఆగిన టాటాఎస్ వాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో టాటా ఎస్ వాహనం రోడ్డు పక్కన పడిపోయింది. డ్రైవర్ ఇస్మాయిల్ తలకు, మరో వ్యక్తి సురేష్ కాలికి గాయాలయ్యాయి. ఈ విషయంపై ఇరువురు వాహన యజమానులు రాజీ అయినట్లు తెలిసింది.

ఈ–కేవైసీ తప్పనిసరి

ముదిగుబ్బ: మండలంలోని 25 పంచాయతీల్లో 18,948 రేషన్ కార్డులు ఉన్నాయి. రేషన్‌కార్డులు ఆయా రేషన్ దుకాణాల వద్ద ఈ–కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ నారాయణ స్వామి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నిర్దేశించిన సమయంలోపు కార్డుదారులతో ఈ–కేవైసీ పూర్తి చేయాలని రేషన్ డీలర్లకు సూచించారు.

రెస్కో మాజీ చైర్మన్ గంగిరెడ్డి మృతి



గంగిరెడ్డి (ఫైల్)

కదిరి/నల్లమాడ: కదిరి రెస్కో మాజీ చైర్మెన్ సోమగుట్ట గంగిరెడ్డి (81) ఇక లేరు. ఆయన అనారోగ్యంతో శనివారం బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. నల్లమాడ మండలం మూలప్పగారి పల్లికి చెందిన ఈయన.. కొన్నేళ్లుగా కదిరిలో కాపురం ఉంటున్నారు. రెస్కో చైర్మన్‌గా ఉన్నప్పుడు ఈయన రైతులకు చాలా సేవలు అందించారు. కదిరి ప్రాంతంలో ఈయన అందరికీ సుపరిచితులు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొడుకు హరినాథరెడ్డి హైకోర్టు న్యాయవాదిగా పని చేస్తున్నారు. గంగిరెడ్డి అంత్యక్రియలు సోమవారం ఆయన స్వగ్రామం అయిన మూలప్పగారి పల్లిలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన మృతిపై అన్ని రాజకీయ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

ఖాద్రీశుడి ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఖాద్రీశుడి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఖాద్రీశుడిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు తరలి వచ్చి దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

గృహహింస కేసు నమోదు

ధర్మవరం అర్బన్: భర్త, అత్త, మామ, ఆడపడుచులు హింసిస్తున్నారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 498 (ఏ) కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ రెడ్డప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సిద్దయ్య గుట్టకు చెందిన మీనాక్షిని మారుతీనగర్‌లో నివసిస్తున్న సత్యనారాయణకు ఇచ్చి వివాహం చేశారు. భర్త సత్యనారాయణతో పాటు అత్త సరోజమ్మ, మామ పెద్దన్న, ఆడపడుచులు పూర్ణిమ, సాయిలీల, సంధ్య, పెద్ద మామ వెంకటరమణ హింసిస్తున్నారు. తనకు న్యాయం చేయాలని బాధితురాలు మీనాక్షి ఫిర్యాదు చేయడంతో గృహహింస కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం



హోమం చేస్తున్న అర్చకులు

తలుపుల: మండలంలోని ఓబుళేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం ఉదయం నుంచి పూజలు, హోమాలు నిర్వహించారు. ఓబుళేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేసిన 41 రోజుల పూజల అనంతరం ఈ హోమాలు చేపట్టినట్లు అర్చకులు తెలిపారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల దేవుడి కాపులు, భక్తులు పాల్గొన్నారు.

కాటికోటేశ్వర క్షేత్రం వెళ్లొద్దామా..

- భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న కాటమయ్య
- ఈనెల 12వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ సిబ్బంది



కాటి కోటేశ్వర క్షేత్రంలోని దేవాలయం



కాటి కోటేశ్వరుడి మూలవిరాట్



అలంకరణలో గంగుమాలమ్మ మూలవిరాట్

బత్తలపల్లి: మండలంలోని సంజీవపురం సమీపంలో వెలసిన కాటికోటేశ్వర క్షేత్రం బ్రహ్మోత్సవాలకు ముస్తాబు అవుతోంది. ప్రకృతిమాత ఒడిలో పచ్చని పంటపొలాల మధ్య కాటమయ్య దేవాలయం వెలిసింది. కాటమయ్య స్వామి భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు. ఈ క్షేత్రంలో వెలసిన కాటికోటేశ్వరుడు సాక్షాత్తు మహాశివుడి స్వరూపమని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ దేవాలయాన్ని సుమారు నాలుగు వందల సంవత్సరాల క్రితం నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. అయితే ప్రస్తుత ఆలయ ధర్మకర్తలు ఈ ఆలయాన్ని తిరిగి పునర్నిర్మాణం జరిపించారు.

ఏటా బ్రహ్మోత్సవాలు

ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం శుక్లపక్ష పౌర్ణమి నుంచి బహుళ విధియ వరకు ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలను ఆలయ ధర్మకర్తలు ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతోంది. ఈ ఉత్సవాల్లో భాగంగా 12వ తేదీన రెడ్డివారి బోనాలు నిర్వహిస్తారు. ఈదుల ముష్టూరు గ్రామంలోని రెడ్లు అందరూ సమావేశమై క్షేత్రానికి చేరుకుని స్వామికి తొలిపూజలు నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం వేద పండితులు తొలిపూజలు చేస్తే మిగిలిన రోజుల్లో తలార్లు (బోయ) పూజలు చేస్తారు. దీంతో ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమవుతాయి. 12వ తేదీ మొదటి రోజు స్వామివారి మూలస్థానమైన ఈదులముష్టూరు గ్రామంలో రెడ్డివారి బోనాలు, బ్రాహ్మణ సంప్రోక్షణ, శిలావరపోటు ఉపశమన పూజ, ధ్వజారోహణం, ఊరేగింపు ఉంటాయి. 13వ తేదీ రెండవ రోజు కాటమయ్య స్వామి ఉత్సవప్రభకు అశ్వ, గజ, నంది వాహనాలను పూన్చుట, సాయంత్రం 4 గంటలకు నిమ్మచెట్ల బావి మోటున గంగపూజ నిర్వహిస్తారు. రాత్రి 10 గంటలకు ముష్టూరు నుంచి స్వామి కొండకు బయలుదేరి వెళ్తారు. 14వ తేదీ రాత్రి 10 గంటలకు తేరువీధుల్లో స్వామి ఊరేగింపు, 11:30 గంటలకు లంకాదహనం జరుగుతుంది. 15వ తేదీ పన్నారపు బండ్ల ప్రదక్షిణ, పగలు తేరు, సాయంత్రం స్వామి ముష్టూరు గ్రామానికి చేరుకుంటాడు. అక్కడ గ్రామోత్సవం నిర్వహిస్తారు. 16వ తేదీ ముష్టూరు గ్రామంలోని ఎర్రికొండా భక్తుని జీవగడ్డలో స్వామికి మారు పూజలు నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ధర్మకర్త సుధాకర రెడ్డి తెలిపారు.

వివాహాలకు వేదిక ఈ క్షేత్రం..

ఈ క్షేత్రంలో అన్ని సౌకర్యాలు ఉండటంతో ఇక్కడ వివాహాలు కూడా అధికంగా జరుగుతున్నాయి. ఈ పరిస్థితిని గమనించిన టీటీడీ వారు కల్యాణ మండపం నిర్మించారు. ఈ మండపం అందరికీ అందుబాటులో ఉంటోంది. క్షేత్రంలో ఒకేరోజు పది నుంచి 20 దాకా వివాహాలు జరిగాయి.

ఇవీ క్షేత్రంలో ప్రత్యేకతలు..

కాటికోటేశ్వర క్షేత్రంలో కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. కొండకు పడమటి దిశన హనుమంతుడి పాదం అని చెప్పబడే హనుమప్ప దొన ఉంది. బండమీద ఉన్న ఈ దొనలో ఎల్లప్పుడు నీరు పొంగుతుండటం విశేషం. అంతేకాక ఆ నాటి లోతు ఇంత వరకు ఎవ్వరికీ అంతుచిక్కడం లేదు. ఈ దొనలోని నీరు చల్లగా, తీయగా ఉంటాయి. ఈ దొనలోని నీటిని వ్యాధులున్న పంట పొలాలు, పశువులు, రోగులపై చల్లితే వ్యాధులు నయమవుతాయని నమ్మకం. ఈ కొండలో వివిధ సమస్యలతో సతమతమయ్యే వారు ఈ క్షేత్రంలో నిద్రచేస్తే సమస్యలు తొలగిపోతాయి. కాటమయ్య కుక్కలాగ కలలో కనిపించి వారికి పరిష్కార మార్గం చెబుతారని ఇక్కడి భక్తుల విశ్వాసం. కోర్కెలు తీరిన భక్తులు స్వామికి కానుకలు, తలనీలాలు సమర్పించుకుంటారు. అనంతపురం ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేషంగా ఈక్షేత్రాన్ని దర్శిస్తారు. క్షేత్రంలో గంగుమాలమ్మ (గంగమ్మ) గుడి, పోతులయ్య గుడి, అక్కమ్మ దేవతలు, నాగల కట్ట తదితర దేవాలయాలు ఉన్నాయి. కొండ శిఖరంలో స్వామి వారి గరుడ స్తంభం మీద వెలిగించే జ్యోతిని చూడడానికి భక్తులు వేల సంఖ్యలో తరలివస్తారు. మాఘమాసంలో మూడవ, చివరి ఆదివారం ఇక్కడ పాలపొంగులు నిర్వహిస్తారు.

ఎలా వెళ్లాలంటే..

అనంతపురం–బత్తలపల్లి జాతీయ రహదారిపై మండల పరిధిలోని సంజీవపురం వద్ద ఆర్టీసీ బస్సులో దిగాలి. అక్కడ నుంచి కొద్ది దూరం నడిచి వెళ్లాలి. ఆటోల్లో అయితే నేరుగా కొండ వద్దకు వెళ్లిపోవచ్చు.

ధర్నా జయప్రదం చేయండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న రైతు సంఘం నాయకులు

తాడిమర్రి: పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయం ముందు ఈనెల 10వ తేదీన చేపట్టనున్న రైతు ధర్నాను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న పిలుపునిచ్చారు. శనివారం చిల్లకొండయ్యపల్లి, దాడితోట గ్రామాల్లో రైతు సంఘం నాయకులు, కార్యకర్తలతో కలసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాడితోట, పెద్దకోట్ల గ్రామాల మధ్య, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సమీపంలో కొండలపై అదానీ కంపెనీ చేపట్టిన హైడ్రో పవర్ ప్రాజెక్టు వల్ల దాడితోట, పెద్దకోట్ల, చిల్లకొండయ్యపల్లి గ్రామాల రైతులకు నష్టం జరుగుతుందన్నారు. కొండలపై బ్లాస్టింగ్ చేస్తుండంతో బోరుబావుల్లో నీటి దారులు మూసుకుని పోయి బోర్లు ఎండిపోతున్నాయన్నారు. చీనీ, అరటి, దానిమ్మ పంటలపై దుమ్ము చేరి పంటల దిగుబడి లేక రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మారుతి, సీఐటీయూ జిల్లా నాయకుడు జేవీ రమణ, నారాయణ, రైతు సంఘం కమిటీ సభ్యులు పోతలయ్య, వెంకట రాముడు తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు రైతుల గోడు మీకు పట్టదా?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కనగానపల్లి: తన కుప్పం ప్రాంత రైతులకు మేలు జరిగేలా సీఎం చంద్రబాబు హంద్రీ–నీవా కాలువలో లైనింగ్ పనులు చేయిస్తుంటే వత్తాసు పలుకుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీతకు రాప్తాడు నియోజకవర్గ రైతుల గోడు పట్టదా అని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. శనివారం కనగానపల్లిలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డితో కలసి పలువురు మండల నాయకులు విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ప్రాంతానికి హంద్రీ–నీవా తీసుకొచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంతవరకు ఈ ప్రాంతంలోని చెరువులకు నీరు వదలకపోవటంతో పాటు పేరూరు డ్యాంకు కూడా నీటిని తరలించలేదన్నారు. ఇంతలోనే జీడిపల్లి నుంచి వస్తున్న హంద్రీ–నీవా నీటిని ఆపేసి కాలువలో లైనింగ్ పనులు చేపట్టాలని అధికారులు కసరత్తు చేస్తున్నారన్నారు. దీనివల్ల రాప్తాడు నియోజకవర్గంలోని రైతులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలలోని రైతులకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాంత ఎమ్మెల్యేగా ఉన్న పరిటాల సునీత దీనిపై పోరాటం చేయకుండా అసెంబ్లీలో కట్టుకథలు చెపుతున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించతలపెట్టిన 'ఫీజు పోరు'ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మామిళ్లపల్లి అమరనాథ రెడ్డి, బద్దలాపురం పెద్దిరెడ్డి, కనగానపల్లి అంకె అశోక్, వలగొండ భాస్కర్, గోపాల్, సి.రవి, రమేష్, కుళ్లాయప్ప, వేపకుంట రామలింగారెడ్డి, వైస్ ఎంపీపీ రాజు, నారాయణ, కృష్ణారెడ్డి, పాతపాళ్యం సుధాకరరెడ్డి, నెమలివరం శీనా పాల్గొన్నారు. దీనిద్వారా వస్తున్న కృష్ణమ్మ జలాలతోనే

ఘనంగా మహిళా దినోత్సవం

పుట్టపర్తి టౌన్/తాడిమర్రి/ముదిగుబ్బ/తనకల్లు/ధర్మవరం/ధర్మవరం అర్బన్/బత్తలపల్లి/పుట్టపర్తి టౌన్/ఓడీచెరువు/కదిరి అర్బన్/కదిరి టౌన్/ఎన్పీకుంట/ధర్మవరం రూరల్: ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పుట్టపర్తిలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రత్న కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అక్షరాస్యతతోనే మహిళా సాధికరత సాధ్యమన్నారు. ఆడపిల్లల్ని బాగా చదివించాలని సూచించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కదిరి మండల పరిధిలోని పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో మహిళా కౌన్సిలర్లను పూలమాలలతో సన్మానించారు. తాడిమర్రి, ముదిగుబ్బ, తనకల్లు, ధర్మవరం, బత్తలపల్లి, ఓడీచెరువు, కదిరి, ఎన్పీకుంటలో మహిళలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.



పుట్టపర్తి టౌన్: మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్టీసీ సిబ్బంది



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ బగ్గిరి త్రివేణి



ధర్మవరం అర్బన్: కేక్ కట్ చేస్తున్న కాకతీయ విద్యానికేతన్ నిర్వాహకులు



ధర్మవరం అర్బన్: మహిళలను సన్మానిస్తున్న మానవత సంస్థ సభ్యులు



ఓడీచెరువు: మాట్లాడుతున్న ఆర్డీటీ ప్రతినిధులు



ధర్మవరం రూరల్: పోతులనాగేపల్లిలో మహిళా దినోత్సవం



ఎన్పీకుంట: ర్యాలీలో పాల్గొన్న మహిళలు



తాడిమర్రి: ఆటల పోటీల్లో పాల్గొన్న మహిళలు



ధర్మవరం: ఉపాధ్యాయినులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



ముదిగుబ్బ: పీఏస్ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలు

రాజీమార్గంతో కేసుల పరిష్కారం



భార్యాభర్తలను రాజీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి, తదితరులు



కేసు పరిష్కార పత్రాలు అందుకుంటున్న బాధితులు

ధర్మవరం అర్బన్: రాజీమార్గంతో కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి హరీష్ తెలిపారు. ధర్మవరంలోని కోర్టు సముదాయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌లో 308 కేసులు పరిష్కారమయ్యాయి. విడాకుల కేసులు–3, బ్యాంకు రుణం కేసులు–2 (రూ.42 వేలు), ప్రీలిటిగేషన్ కేసు–1 (రూ.2 లక్షలు), జరిమానా కేసులు 4 (రూ.13 వేలు), ఈపీ–1 (రూ.1,19,000), భరణం–1, భూమి పరిష్కారం కేసులు–3, కొట్లాట కేసులు–126, సారాయి కేసులు–65 (రూ.1,91,000), ఇసుక రవాణా కేసులు–14 (రూ.1,84,000), పేకాట కేసులు–88(రూ.1,50,430) మొత్తం 308 కేసులు పరిష్కారమయ్యాయి. జాతీయ లోక్ అదాలత్‌కు హాజరైన కక్షిదారులకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు భోజన వసతి ఏర్పాటు చేశారు. న్యాయవాదులే దగ్గరుండి కక్షిదారులకు భోజనాన్ని వడ్డించారు.

356 కేసుల పరిష్కారం

కదిరి టౌన్: కదిరి కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కదిరి డివిజన్ పరిధిలో 356 కేసులు పరిష్కరించినట్లు కదిరి న్యాయమూర్తి ఎస్.జయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో న్యాయాధికారి బుజ్జప్ప, పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి, న్యాయవాదులు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, నరసింహులు, రామస్వామి నాయుడు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి గాయాలు

కదిరి అర్బన్: మండల పరిధిలోని గట్ల వద్ద కే.బత్తలపల్లికి వెళ్లే దారిలో శనివారం విద్యుత్ స్తంభం మారుస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్‌షాక్‌కు గురై బిహార్‌కు చెందిన ఆసిఫ్ అనే కార్మికుడికి స్వల్ప గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. విద్యుత్ స్తంభం మారుస్తుండగా వైర్లు సరిచేసే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. లైన్‌మెన్ ఎల్‌సీ తీసుకున్నప్పటికీ తీగల్లో ఎర్త్ కావడంతో ప్రమాదం జరిగిందని విద్యుత్‌శాఖ సిబ్బంది చెబుతున్నారు.

హోరాహోరీగా రాతి దూలం లాగుడు పోటీలు



రాప్తాడు: అయ్యవారిపల్లిలో ఎర్రిస్వామి తాత ఉట్ల పరుష సందర్భంగా శనివారం ఉదయం ఆలయం దగ్గర కాల్వగొంచి నిర్వాహకులు, గ్రామ ప్రజలు నిర్వహించిన జిల్లాస్థాయి రాతి దూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. వివిధ ప్రాంతాలకు చెందిన 4 జతల దేశీయ ఎద్దులు (వృషభాలు) పాల్గొన్నాయి. ఒక్కో జతకు 20 నిమిషాల సమయం కేటాయించారు. పోటీల్లో ఆత్మకూరు మండలం తోపుదుర్తికి చెందిన కె.చెన్నప్ప వృషభాలు ప్రథమ, శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం మద్దెలచెరువుకు చెందిన మూలింటి కొండయ్య వృషభాలు ద్వితీయ, కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన ఆనంద్‌రెడ్డి వృషభాలు తృతీయ, చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దెల పూజారి తిప్పన్న వృషభాలు నాలుగో స్థానంలో నిలిచాయి. విజేత వృషభాల యాజమానులకు ప్రథమ బహుమతి (రూ.25 వేలు) బుల్లే పెద్ద ఇటికనల్లప్ప కుమారులు, ద్వితీయ బహుమతి (రూ.20 వేలు) వెన్నపూస సూర్యచంద్రారెడ్డి, తృతీయ బహుమతి (రూ.15 వేలు) కపాడం పవన్ సందీప్, నాలుగో బహుమతి (రూ.10 వేలు) పిట్టా ఆదినారాయణ పంపిణీ చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.30,060 స్వాధీనం



పేకాటరాయుళ్ల నుంచి నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

బత్తలపల్లి: మండలంలోని తంబాపురం శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.30,060 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. శనివారం సాయంత్రం తంబాపురం గ్రామ శివారులోని సపోటా తోటలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో దాడి చేసినట్లు పేర్కొన్నారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.30,060 నగదు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పేకాటరాయుళ్లపైన కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు బహుమతుల ప్రదానోత్సవం

పుట్టపర్తి టౌన్: వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు, మెగా డీఎస్సీ కోసం సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు నిర్వహించిన ట్యాలెంట్ టెస్ట్ విజేతలకు ఆదివారం బహుమతులు అందజేయనున్నారు. అనంతపురం పంగల్ రోడ్డులో ఉన్న ఆర్డీటీ ఇన్‌క్లూజివ్ సెంటర్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వదాన్య ఫౌండర్ అశోక్ పడపాటి తెలిపారు. ముఖ్య అతిథులుగా మాంఫోఫ్రెర్, మల్లారెడ్డి, బీపీఎస్ రవి, అనంతపురం డిస్కవరీ అనిల్, పర్యావరణవేత్త ఎస్‌కె లెనిన్ బాబు, న్యాయవాది ప్రభాకర్ రెడ్డి తదితరులు హాజరువుతరన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

ఓడీచెరువు: కదిరి మండలం, కదిరి మున్సిపాలిటీ, ముదిగుబ్బ, తలుపుల, గాండ్లపెంట, ఎన్పీ కుంట, అమడగూరు, ఓడీచెరువు, నల్లమాడ మండలాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈఈ జాన్ మోసెస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 132కేవీ కుటాగుళ్ల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

5 తులాల బంగారం చోరీ

- లక్ష్మీచెన్నకేశవ పురంలో దొంగతనంపై కేసు నమోదు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో నివసిస్తున్న ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు గంగాద్రి ఇంటిలో శుక్రవారం దొంగతనం జరిగినట్లు శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గంగాద్రి ఇంట్లో లేని సమయంలో ఇంట్లోకి దొంగలు ప్రవేశించారు. సుమారు 5 తులాల 2 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు బాధితుడు తెలిపాడు. కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

నీటిరంగులతో నారీమణి చిత్రం



రామగిరి: అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పేరూరుడ్యాంలోగల ఏపీఆర్ఎస్ (మహాత్మా జ్యోతిబా పూలే) బాలుర పాఠశాలలో ఆర్ట్ టీచర్ శ్రీరాములు నీటిరంగులతో గీచిన నారీమణి చిత్రం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో స్త్రీ తల్లిగానూ, వ్యాపారవేత్తగానూ, వైద్యురాలిగానూ, ఉపాధ్యాయురాలిగానూ, అటు క్రీడారంగంలోనూ, న్యాయ విభాగంలోనూ కీలకమైనపాత్రలు పోషిస్తోందన్నారు. వీటన్నింటి కలయికతో కూడిన చిత్రాన్ని గీసినట్లు చెప్పారు. ఆర్ట్ టీచర్‌ను తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.